క్లుప్తంగా

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న పాఠశాల విద్య జాయింట్ డైరెక్టర్ అబ్రహం

రాజమహేంద్రవరం రూరల్: ఎస్సీ, ఎస్టీ టీచర్స్ ఫెడరేషన్ తూర్పుగోదావరి జిల్లాశాఖ 2025 డైరీ, క్యాలెండర్‌ను అమరావతి పాఠశాల విద్య జాయింట్ డైరెక్టర్ ఎస్.అబ్రహం, ఉపాధ్యాయ సంఘ ప్రతినిధులు ఆవిష్కరించారు. ఆదివారం బొమ్మూరులోని జాయింట్ డైరెక్టర్ అబ్రహం నివాసంలో ఫెడరేషన్ ప్రతినిధులు కలిసి డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరింపచేశారు. ఈసందర్భంగా ఆయనతో ఉపాధ్యాయ సమస్యలపై చర్చించారు. జిల్లా అధ్యక్షుడు ఎండి సత్యనారాయణరెడ్డి ,కార్యదర్శి ఐ.విష్ణుమూర్తి, కోశాధికారి బందిలి శ్రీను పాల్గొన్నారు.

యోగాతోనే ఆరోగ్యం



యోగా మాస్టారు రామును సత్కరిస్తున్న లక్ష్మారెడ్డి తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: నిత్య యోగా సాధనతోనే శారీరక రుగ్మతలు నశించడంతో పాటు మానసిక ఆరోగ్యం సాధ్యపడుతుందని లయన్ డాక్టర్ టి.లక్ష్మారెడ్డి అభిప్రాయపడ్డారు. లయన్స్ రాజమండి రూరల్ శాఖ ఆధ్వర్యంలో ప్రముఖ యోగా మాస్టారు తీడరాము శిక్షణలో వారంరోజులపాటు శాటిలైట్‌సిటీలోని జక్కంపూడి రామ్మోహనరావు కల్యాణ మండపంలో జరిగిన యోగాశిక్షణ తరగతులు ఆదివారంతో ముగిశాయి. ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ లక్ష్మారెడ్డి యోగామాస్టారు తీడారాముని సత్కరించి జ్ఞాపికను అందజేశారు. అనంతరం యోగా సాధకులకు సాధనా పట్టికలు అందజేసి సద్వినియోగపరుచోవాలని కోరారు.తనకు జరిగిన సత్కారానికి యోగామాస్టారు తీడరాము కృతజ్ఞతలు తెలిపారు.

మంత్రి దుర్గేష్ కార్యాలయం ప్రారంభం

రాజమహేంద్రవరం రూరల్: హుకుంపేట గ్రామంలో జురా హోటల్ పక్కన రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖామంత్రి కందుల దుర్గేష్ జిల్లా కార్యాలయాన్ని ఆదివారం ప్రారంభించారు. ఆయన చిన్నాన్న మేడా దత్త త్రినాథ్ గోపాల్ చేతుల మీదుగా ప్రారంభించి పూజలు నిర్వహించారు.

సీఆర్పీల సమస్యల పరిష్కారానికి కృషి

కంబాలచెరువు: సీఆర్పీల ఉద్యోగ భద్రత, కనీస వేతనాల అమలు వంటి సమస్యల పరిష్కరించడానికి కృషి చేస్తానని ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం హామీ ఇచ్చారు. రాజమహేంద్రవరం శ్రీ సాయిరాం ఫంక్షన్ హాల్లో ఆదివారం నిర్వహించిన ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పీఆర్పీ ఫెడరేషన్ సర్వసభ్య సమావేశానికి రాష్ట్ర అధ్యక్షుడు గిరి శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. జిల్లా అధ్యక్షుడు ఎం.రఘునాథ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సభకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. రాజ్యాంగ రీత్యా ఇచ్చిన హక్కులు సాధించడానికి ముఖ్యమంత్రి, ప్రభుత్వ విద్యాశాఖ ఉన్నత అధికారుల దగ్గరకి తీసుకువెడతానని, వినతి పత్రంలో ఇచ్చిన ఆరు సమస్యలు పరిష్కారానికి సమైక్యంగా కృషి చేద్దామని చెప్పారు. ఈ నెల 27వ తేదీన నిర్వహించే ఎమ్మెల్సీ పట్టభద్రుల ఎన్నికలలో మొదటి ప్రాధాన్యత ఓటును తనకు వేసి గెలిపించాలని కోరారు.

సినిమాలు



శ్యామల	: సంక్రాంతికి వస్తున్నాం
సూర్యమినీ	: దేవా
సూర్యప్యాలెస్	: ప్రేమిస్తావా,మదగజరాజు
స్వామి	: సంక్రాంతికి వస్తున్నాం
శివజ్యోతి	: గేమ్‌ఛేంజర్
అనుశ్రీ	: మదగజరాజు
రాజా	: మదగజరాజు
ఊర్వశి	: పుష్ప-2
మేనక	: మహిష
రంభ	: సైకోపోర్స్
కుమారి	: రాచరికం(మార్నింగ్‌షో), పుష్ప-2(2షోలు)
అప్సర	: డాకుమహరాజ్
అశోక	: డాకుమహరాజ్
నామవరం	
వివిఎస్.మహల్	: సంక్రాంతికి వస్తున్నాం
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	: సంక్రాంతికి వస్తున్నాం
కడియం	
వెంకటసూర్య	: సంక్రాంతికి వస్తున్నాం



కంబాలచెరువు పార్కు



కంబాలచెరువు లోపలి దృశ్యం

ఉచిత ప్రవేశం హుళక్కేనా?

- కంబాలచెరువు పార్కులో టికెట్ వసూలు చేయబోమని చెప్పిన ఆదిరెడ్డి వాసు
- ఎమ్మెల్యేగా ఎన్నికై 7 నెలలు పూర్తయినా అమలు కాని హామీ
- విస్మపోతున్న సామాన్య, మధ్య తరగతి ప్రజలు

రాజమహేంద్రవరం సిటీ: నగరంలో ప్రతిష్టాత్మకమైన కంబాలచెరువు పార్కులో ప్రవేశాన్ని ఉచితం చేస్తామంటూ ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన ఆదిరెడ్డి శ్రీనివాస్ సిటీ ఎమ్మెల్యేగా ఎన్నికై ఏడు నెలలు పూర్తయినా హామీ పట్టించుకోకపోవడంతో నగర ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ఆధునీకరించి ఉచిత ప్రవేశం కల్పించాల్సిన అధికారులు కంబాలచెరువు పార్కును ప్రవేశానికి ధర నిర్ణయించడంతో సామాన్య, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. సాయంత్రం వేళల్లో కుటుంబంతో సరదాగా ఆహ్లాదంగా గడిపేందుకు పార్కుకు వెళ్లాలంటే ఎంట్రీ టికెట్ కొనుగోలు చేసి వెళ్లాల్సి వస్తోందంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కంబాలచెరువు పార్కును వైఎస్సార్ సీపీ హయాంలో నగరపాలక సంస్థ, రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా 13 కోట్ల రూపాయల వ్యయంతో ఆధునీకరించాయి. ఆ పార్కును ప్రజలకు ఉచితంగా అందుబాటులోనికి తీసుకురావాల్సి ఉండగా ప్రవేలను నిర్ణయించారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పెద్దలకు 30 రూపాయలు, పిల్లలకు 20 రూపాయలు చొప్పున టికెట్ ధర నిర్ణయించారు. సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 9.30 గంటల వరకు పెద్దలకు 50 రూపాయలు, పిల్లలకు 30 రూపాయలు చొప్పున టికెట్ ధర నిర్ణయించారు. అయితే ఈ ధరలపై ప్రస్తుత ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ప్రతిపక్షంలో ఉండగా తాము అధికారంలోకి వచ్చిన వెంటనే పార్కులోకి ఉచిత ప్రవేశం కల్పిస్తామంటూ హామీ ఇచ్చేశారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది హామీ ఇచ్చిన ఆదిరెడ్డి శ్రీనివాస్ ఎమ్మెల్యేగా గెలుపొందారు. కంబాలచెరువు పార్క్ ప్రవేశాన్ని ఉచితం చేస్తానంటూ ప్రకటించిన ఆయన ఆ మాట మర్చిపోయారు. ఇచ్చిన మాట ప్రకారం కంబాలచెరువు పార్క్ లోనికి ఉచిత ప్రవేశం కల్పించాలంటూ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. కంబాలచెరువు పార్క్ లోనికి కుటుంబంతో వెళ్లాలంటే అధిక మొత్తంలో డబ్బు ఖర్చు అవుతోందంటూ ప్రజలు వాపోతున్నారు. ఎప్పటికైనా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ఉచిత ప్రవేశాన్ని కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు.



ఎంట్రీ టికెట్ ధరల వివరాలు

ఎమ్మెల్యే ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి



అధికారంలోకి వస్తే పార్కులోనికి ఉచిత ప్రవేశం కల్పిస్తానని హామీ ఇచ్చిన సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట నిలబెట్టుకోవాలి. సామాన్యులు పార్కులోనికి వెళ్లాలంటే టికెట్ కొనుగోలు చేసి వెళ్లడం హాస్యాస్పదంగా ఉంది .ఇప్పటికైనా అధికార పార్టీ నాయకులు ప్రత్యేక దృష్టి సారించి మానవతా దృక్పథంతో పార్కులోనికి ఉచిత ప్రవేశాన్ని కల్పించాలి.

– శ్యామల దేవి, గృహిణి, రాజమహేంద్రవరం

పేద ప్రజలకు అందుబాటులో లేని పార్క్



కంబాలచెరువు పార్కు లోనికి ప్రవేశించేందుకు టికెట్ నిర్ణయించడంతో సామాన్యులు పేద వర్గాలకు చెందిన ప్రజలు పార్కులోనికి వెళ్లే సాహసం చేయలేకపోతున్నారు. పేదలు అధికంగా నివసించే కంబాలచెరువు చుట్టుపక్కల ప్రాంతాలకు పార్కు సాయంత్రం వేళలో ఎంతో ఆహ్లాదాన్ని ఇచ్చేది. అయితే ప్రవేశానికి టికెట్ భారీ మొత్తంలో వసూలు చేయడంతో కంబాలచెరువు వైపు వెళ్లలేకపోతున్నారు. పేద ప్రజల మనోభావాలను దృష్టిలో ఉంచుకుని అధికార పార్టీ చెందిన నాయకులు పార్కులోకి ప్రవేశాన్ని ఉచితం చేయాలి.

– దేవరపల్లి అనిల్‌కుమార్, వ్యాపారస్తుడు, రాజమహేంద్రవరం

కళాతపస్వి విశ్వనాథ్‌కు నివాళులు



విశ్వనాథ్ చిత్రపటానికి నివాళులర్పించిన జిత్‌మోహన్‌మిత్ర తదితరులు

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): భారతీయ చలనచిత్ర పరిశ్రమలో ప్రముఖ దర్శకుడు, కళాతపస్వి కె.విశ్వనాథ్‌ను జిత్‌మోహన్‌మిత్ర ఆర్కెస్ట్రా ద్వారా అప్పట్లో సత్కరించుకోవడం పూర్వజన్మ సుకృతమని ప్రముఖ నట,గాయకులు జిత్‌మోహన్ మిత్ర అన్నారు. ఆదివారం స్థానిక జిత్‌మోహన్‌మిత్ర కళావేదికపై విశ్వనాథ్ ద్వితీయ వర్ధంతి నిర్వహించారు. జిత్‌మోహన్‌మిత్ర, ముద్రగడ ఏసుబాబు, వీఎస్‌ప్రసాద్‌లు కె.విశ్వనాథ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ కె.విశ్వనాథ్ రాజమహేంద్రవరం కళాకారులతో రూపొందించిన చిత్రాలకు సహకరించడంతో పాటు ఆయన చిత్రాల్లో నటించడం తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు. సంస్కృతి సంప్రదాయాలకు, సంగీతానికి కళలకు ప్రాధాన్యం ఇస్తూ రూపొందించిన చిత్రాల ద్వారా ఎప్పటికీ సజీవంగానే అందరి మదిలో ఆయన నిలిచిపోతారని పలువురు వక్తలు కొనియాడారు. జిత్‌మోహన్ మిత్ర ఆర్కెస్ట్రా గాయనీ గాయకులు విశ్వనాథ్ చిత్రాలలో విజయవంతమైన గీతాలు పాడి స్వర నివాళి అర్పించారు. డాక్టర్ గిరిజాలసోమరాజునాయుడు, జల్లి శివప్రసాద్, సుక్కిరెడ్డి శ్రీనివాస్, పీవీఎస్ కృష్ణారావు, బి.సీతారామారావు, నాగేంద్ర, డాక్టర్ హరి, జి.వి.ఎస్.లక్ష్మీతులసి, గుంటూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

యువత ఉద్యోగాలు పొందేలా మార్గదర్శనం

రాజమహేంద్రవరం సిటీ: స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం అనే ఉదాత్త ఆశయాల కోసం నిరంతరం పనిచేస్తూనే ఉంటామని సమతా సేవాసమితి వ్యవస్థాపకులు, రిటైర్డ్ ఆదాయపనులశాఖ చీఫ్ కమిషనర్ మేడిశెట్టి తిరుమలకుమార్ చెప్పారు. సమతా సేవాసమితి 30వ వార్షికోత్సవ ప్రత్యేక సంచికను ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ప్రొఫెసర్ కె.సుమన్ చంద్ర ఆవిష్కరించారు. తిరుమలకుమార్ మాట్లాడుతూ పోటీ పరీక్షలకు హాజరయ్యే యువతకు సరైన శిక్షణ ఇవ్వడానికి సమతా సేవా సమితి స్థాపించి ఎంతోమంది ఉద్యోగాలు పొందేలా చేయగలిగామన్నారు. ఒక తరానికి ప్రాతినిధ్యం వహించిన సమతా సేవాసమితి సమాచారాన్ని నిక్షిప్తం చేయడానికి 30 వసంతాల ఈ ప్రత్యేక సంచిక ప్రచురించామన్నారు. సానబోయిన రామారావు బలహీన వర్గాల నాయకులు ఎల్.వి. ప్రసాద్,బి.జార్జి ఆంటోని పాల్గొన్నారు.



30 వసంతాల సంచికను ఆవిష్కరించిన దృశ్యం

సమష్టి కృషితో వాతావరణ సమతుల్యత



గుడ్డ సంచులతో నినాదాలు ఇస్తున్న సత్య చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు

రాజమహేంద్రవరం రూరల్: వాతావరణ సమతుల్యతను పాటించడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సత్య చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు తమ్మా రవి సూచించారు. సత్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆర్ట్స్ కాలేజీ వై.జంక్షన్‌లో ఉన్న రైతు బజార్ వద్ద వాతావరణ సమతుల్యతను కాపాడడంలో భాగంగా ఆదివారం ప్లాస్టిక్ బ్యాగ్‌లను వాడడం నిషేధించామని, గుడ్డ సంచులను మాత్రమే వాడాలని నినాదం ఇస్తూ పాంప్లేట్స్ పంచుతూ ప్రజలందరికీ ఉచితంగా గుడ్డ సంచులు పంపిణీ చేశారు. సుమారు 400 గుడ్డ సంచులను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో మెహర్ మధు, సత్య చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు తమ్మారవి, ట్రెజరర్ ఎం.సూర్య, జాయింట్ సెక్రటరీ ఎం.శ్రీనివాస్, ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్స్ భరద్వాజ, రఘువీర్ శ్రీనివాస్ బళ్లారి, గౌరవ సలహాదారులు యు.శ్రీరామ్ మూర్తి, కొమ్మ శ్రీనివాసరావు, గౌరవ సభ్యులు నాగేశ్వరావు, సత్యనారాయణ, సురేష్ పాల్గొన్నారు.

రీజియన్ బెస్ట్ ప్రెసిడెంట్‌గా మద్దుల

రాజమహేంద్రవరం సిటీ : స్నేహ చందనం లయన్స్ రీజనల్ కాన్ఫరెన్స్‌లో లయన్స్ క్లబ్ రాజమహేంద్రవరం అధ్యక్షుడు బెస్ట్ లయన్ ఆఫ్ రీజియన్, రీజియన్ బెస్ట్ ప్రెసిడెంట్‌గా క్లబ్ అధ్యక్షుడు మద్దుల వీఎస్ శ్రీరామ గుప్త ఎంపికయ్యారు. ఆదివారం రాజమహేంద్రవరంలో లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో రీజియన్ చైర్ పర్సన్ ముదునూరి వాణిశ్రీ అధ్యక్షతన హోటల్ లా హాస్పిన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో రీజియన్ -4కి చెందిన 16 క్లబ్బుల నుంచి సుమారు 300 మంది సభ్యులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ రాజమహేంద్రవరం 20 అవార్డులు అదుకుంది. స్టార్ ఆఫ్ రీజియన్‌గా కొల్లూరి గోపాలకృష్ణ, బెస్ట్ అడ్మిన్‌గా గ్రంధి వసంతకుమారి, బెస్ట్ ట్రెజరర్‌గా ఉలగంటి రాఘవరావు, సెకండ్ బెస్ట్ సెక్రటరీగా వెన్న కుమారస్వామిని అవార్డులు వరించాయి. గత ఆరు నెలల్లో వెయ్యికి పైగా వివిధ సేవలు అందించిన రాజమహేంద్రవరం క్లబ్ కి బెస్ట్ క్లబ్ ఆఫ్ రీజియన్‌గా, క్యాన్సర్ అవేర్నెస్‌కి, డయాబెటిస్ ప్రోగ్రాం, విజన్ ప్రోగ్రాం కి బెస్ట్ అవార్డులు సాధించారు. పూర్వపు గవర్నర్‌లు మాటూరి మంగతాయారు, బాదం బాలకృష్ణ, గ్రంధి వేంకటేశ్వరరావు, బీవీఎన్ రెడ్డి పాల్గొన్నారు.



రీజియన్ బెస్ట్ ప్రెసిడెంట్‌గా మద్దుల శ్రీరామ గుప్త

వలంటీర్ల ఆధ్వర్యంలో సేవ్ గోదావరి

కంబాలచెరువు: స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాలల ఎన్.ఎస్.ఎస్., యూత్ రెడ్ క్రాస్‌కు చెందిన 80 మంది వలంటీర్లు గోదావరి జలాలను రక్షించాలి అనే సదుద్దేశంతో పుష్కర ఘాట్‌లోని గోదావరి నది ఒడ్డున ప్లాస్టిక్ సంచుల ఏరివేత, వ్యర్థ పదార్థాలను తొలగించడం తదితర కార్యక్రమాలను చురుకుగా చేశారు. కార్యక్రమానికి స్థానిక ఆదిత్య విద్యాసంస్థల డైరెక్టర్ ఎస్పీ గంగిరెడ్డి అధ్యక్షత వహించగా, సెంట్రల్ జోన్‌డీఎస్పీ కె రమేష్‌బాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గౌరవ అతిథిగా యూత్ రెడ్ క్రాస్ ఎంసి మెంబర్ డాక్టర్ జీఎస్‌వీఏబీఎస్ మహాలక్ష్మి హాజరయ్యారు. డీఎస్పీకే రమేష్‌బాబు మాట్లాడుతూ ఆదిత్య ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పుష్కరాల్లోనూ శివరాత్రి దసరా ఉత్సవాలలో ఎంతో సేవ చేశారని గంగిరెడ్డి సహకారం మరువలేనని ఈ సంవత్సరం కూడా మహాశివరాత్రికి వారి సేవలు అవసరమవుతాయన్నారు. ఫ్రెండ్స్ సర్వీస్ సొసైటీ సభ్యులు పి.వి. ఎస్.కృష్ణారావు, కె.సుధాకర్ పట్నాయక్, చందనరాజు, పాల్గొన్నారు. ఎం.హెచ్.ఓ. వినూత్న సహకారంతో కార్యక్రమం జరిగింది. శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎ.దుర్గాప్రసాద్, గణపతి కుమార్ హెల్పర్ వెంకట్, కానిస్టేబుల్ సీహెచ్ రాజేష్ ఎన్.ఎస్.ఎస్.టీం లీడర్స్ మౌనిష్, లక్ష్మీసుమ, వినయ్, సందీప్, సూర్య కీలకపాత్ర వహించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ డాక్టర్ జీవీఎస్ నాగేశ్వరరావు పోలకొండ సాయి, కె.మహేశ్వరి పాల్గొనగా డాక్టర్ బీహెచ్‌వీ రమాదేవి సహకరించారు.



పుష్కరఘాట్‌లో వ్యర్థాలను తొలగిస్తున్న వలంటీర్లు

చెడు వ్యసనాలకు బానిస కాకూడదు

జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్

కంబాలచెరువు: చెడు వ్యసనాలకు యువత బానిస కాకుండా జన విజ్ఞాన వేదిక కార్యకర్తలు పనిచేయాలని రాష్ట్ర కార్యదర్శి కేఎంఎంఆర్ ప్రసాద్ తెలిపారు. స్థానికంగా ఏర్పాటు చేసిన జన విజ్ఞాన వేదిక జిల్లా ప్లీనంకు పరిశీలకులుగా హాజరైన రాష్ట్ర కార్యదర్శి కేఎంఎంఆర్ ప్రసాద్ మాట్లాడుతూ జనవిజ్ఞాన వేదిక ప్రజలలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంచడానికి కృషి చేస్తుందన్నారు. కార్యకర్తలు నిబద్ధతతో కార్యోన్ముఖులై ప్రస్తుత పరిస్థితులలో పనిచేయవలసిన అవసరం ఉందని తెలిపారు. ప్రస్తుత కాలంలో యువత మద్యపానం, ధూమపానం, డ్రగ్స్ వంటి వాటికి అలవాటు పడకుండా యువతను కాపాడుకోవడానికి వేదిక పనిచేయాలని పిలుపునిచ్చారు. అనంతరం జరిగిన ఎన్నికల్లో గౌరవ అధ్యక్షుడిగా ఎం.మల్లికార్జునరావు, వై.పైడియ్య, డాక్టర్ చైతన్య శేఖర్, అధ్యక్షుడిగా కె.భీమయ్య, ఉపాధ్యక్షుడిగా టి.వసంతరావు, ఏఎస్ సుధారాణి, సీహెచ్ శ్రీరాములు, ప్రధాన కార్యదర్శిగా ఎన్.రవిబాబు, కోశాధికారిగా జి.తాతారావు ఎన్నికయ్యారు. కార్యదర్శులుగా జి.రాజేష్‌కుమార్, పీఎంశిరోమణి, కేఎల్ జ్యోతి, సైన్స్ అండ్ టెక్నాలజీ కన్వీనర్లుగా కె.శ్రీకృష్ణ సాయి, బీఎల్ఎస్ ఆనంద్‌బాబు, సమతా కన్వీనర్‌గా వై.బేబీరాణి, యూత్ వింగ్ కన్వీనర్‌గా బోరగుడి నిశ్చల్‌ను ఎన్నుకున్నట్టు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.రవిబాబు తెలిపారు.



మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్

విజయగాథకు నిదర్శనంగా మహారోగి ఆరోగ్య కేంద్రం

మంత్రి దుర్గేష్

రాజమహేంద్రవరం రూరల్: శ్రీ వివేకానంద మహారోగి ఆరోగ్య కేంద్రం విజయగాథకు నిదర్శనంగా నిలిచిందని రాష్ట్ర పర్యాటక ,సాంస్కృతిక , సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. కుష్టువ్యాధితో బాధపడేవారికి సేవ చేయడానికి ఐదు దశాబ్దాల క్రితం ఉద్భవించిన ఈ కేంద్రం చేసిన కృషి అభినందనీయమన్నారు. బొమ్మూరులోని ఆరోగ్య కేంద్రం కుష్టురోగుల పునరావాస కేంద్రం 49వ వార్షికోత్సవం, శ్రీ వివేకానంద చారిటబుల్ కేంద్రం 24వ వార్షికోత్సవం ఆదివారం సంయుక్తంగా మహారోగి ఆరోగ్య కేంద్రంలో నిర్వహించారు. సభకుకేంద్రం అధ్యక్షుడు పతివాడ రామరాజు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన మంత్రి దుర్గేష్ మాట్లాడారు. ఆరోగ్య కేంద్రం వ్యవస్థాపక సభ్యుడు ఆర్‌కే జైన్ మాట్లాడుతూ ప్రదీప్తి సంస్థ ద్వారా ఆనాటి కలెక్టర్ యూబీ రాఘవేంద్రరావు ఇచ్చిన ప్రోత్సాహంతో ఇక్కడ సేవ ప్రారంభించామని, మండవిల్లి మల్లికార్జునరావు దీనికి ఊతమిచ్చారని వివరించారు. ఆర్ఎస్ఎస్ ఆంధ్రప్రదేశ్ ప్రాంత ప్రచారక్ విజయాదిత్య, జీఎస్ఎల్ కేన్సర్ హాస్పిటల్ సర్జికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ గోగినేని తరుణ్ చౌదరి, కేంద్రం ప్రాజెక్టు డైరెక్టర్ ఓలేటి సత్యనారాయణ మాట్లాడారు. శ్రీ వివేకానంద మహారోగి ఆరోగ్య కేంద్రంలో 16ఏళ్ల సేవలందించిన దివంగత డాక్టర్ ఎం జగన్నాథం సతీమణి భాస్కరంను సత్కరించారు. తపనచౌదరి, డాక్టర్ కర్రి రామారెడ్డి, డాక్టర్ పిల్లాడి పరమహంస, రిమ్మలపూడి సుబ్బరాజు, మద్దిపోటి శంభాజీరావు, మత్సేటి శివ ప్రసాద్, కామిని ప్రసాద్ చౌదరి ,ఒంటెద్దు స్వామి పాల్గొన్నారు.



సభలో ప్రసంగిస్తున్న మంత్రి దుర్గేష్

బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్ పదమే ఉచ్చరించలేదు

ప్రకాశంనగర్: కేంద్రంలోని నరేంద్ర మోదీ సర్కారుకు ఆంధ్రప్రదేశ్ అంటే ఎంత చిన్నచూపో మరోసారి పార్లమెంట్ సాక్షిగా ఈ బడ్జెట్ రుజువు చేసిందని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నగర కార్యదర్శి ఎస్.కిరణ్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కనీసం ఆంధ్రప్రదేశ్ అనే పదమే ఉచ్చరించలేదని. ఈ బడ్జెట్ లోనైనా కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ వైపు కన్నెత్తి చూస్తుందేమో అని 5 కోట్ల ప్రజలు ఎదురుచూశారన్నారు. కానీ అందరి ఆశలపై కేంద్ర ప్రభుత్వం మళ్లీ నీళ్లు చల్లిందన్నారు. రానున్న ఎన్నికల కోసం బిహార్‌కు బంగారు పళ్లెంలో వడ్డించి.. ఆంధ్రప్రదేశ్‌కు అన్యాయం చేసిందన్నారు. విశాఖ ఉక్కు – ఆంధ్రుల హక్కు నినాదం నిర్మలా సీతారామన్‌కు గుర్తు రాలేదని, విశాఖ ఉక్కు కార్మాగారాన్ని సెయిల్‌లో విలీనం చేసే ప్రక్రియ గురించి మాట్లాడలేదని విమర్శించారు.

గుర్తుతెలియని మహిళ మృతి

కంబాలచెరువు: సాస్థానిక ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ గుర్తుతెలియని మహిళ మృతి చెందిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. సుమారు 60 ఏళ్ల వయసున్న మహిళ గత నెల 13న ప్రభుత్వాసుపత్రి ఆవరణలో పడిపోయి ఉంది. ఆమెను ఆసుపత్రిలో చేర్చి వైద్య చికిత్సలు అందించారు. ఆమె చికిత్స పొందుతూ మృతి చెందింది. ఆచూకీ తెలిసిన వారు మూడో పట్టణ పోలీసులను సంప్రదించాలని కోరారు.



మృతిచెందిన గుర్తు తెలియని మహిళ

పార్టీ బలోపేతానికి కృషి

రాజానగరం: అధిష్టానం ఇచ్చిన గుర్తింపుతో పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా సమిష్టి కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులకు సూచించారు. నియోజకవర్గం నుంచి ప్రచార విభాగానికి అడబాల వీరసత్యనారాయణ (చినబాబు), సోషల్ మీడియా విభాగానికి వల్లభశెట్టి వెంకటసత్యనారాయణ, బీసీ సెల్ విభాగానికి కొండపల్లి దుర్గారావులను అధ్యక్షులుగా నియమించిన సంగతి విదితమే. వీరంతా ఆదివారం మర్యాద పూర్వకంగా రాజాను కలుసుకుని కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారిని దుశ్శాలువాలతో సత్కరించి, అభినందిస్తూ బాధ్యతలను గుర్తు చేశారు.

ఇరు సామాజిక వర్గాల మధ్య ఘర్షణ

పలువురికి తీవ్ర గాయాలు

సీతానగరం: మండలంలోని మిర్తిపాడులో ఆదివారం ఇరు సామాజిక వర్గాల మధ్య ఘర్షణలు జరిగాయి. దీంతో పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. ఒక వర్గం యువకులు మరో వర్గం యువకులను కామెంట్ చేయడంతో తలెత్తిన వివాదంలో కర్రలతో కొట్టారు. ఒక సామాజిక వర్గం వ్యక్తి ఆదివారం మరణించడంతో అక్కడకు వచ్చినవారు యువకులను కొట్టిన విషయం తెలుసుకుని రాత్రి 7 గంటలకు కర్రలతో సర్పంచ్ వీధిలోకి వచ్చి వీరంగం చేయడంతో అక్కడ భయానక వాతావరణ ఏర్పడింది. దీంతో ఇరు సామాజిక వర్గాల యువకులు కొట్టుకోవడంతో పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న ఎస్సై డి.రామ్‌కుమార్ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని రెండు వర్గాల యువకులను చెదరకొట్టారు. గాయపడిన ఇరు వర్గాల వారిని రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గ్రామంలో ఎస్సై రామ్ కుమార్ పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు.

వైభవంగా మహాకుంభాభిషేకం

రాజానగరం: దివాన్‌చెరువులోని హేరంబ గణపతి, బాలకుమారస్వామి సహిత విశ్వేశ్వరీదేవి ఆలయంలో ఆదివారం మహాకుంభాభిషేకం వేద పండితుల మంత్రోచ్చారణలతో వైభవంగా జరుగింది. సద్గురు కందుకూరి శివానందమూర్తి చేతుల మీదుగా ప్రతిష్ఠ జరిగిన ఈ ఆలయంలో 12 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆలయ శిఖరానికి మహాకుంభాభిషేకం చేశారు. ఇందుకు ఉపయోగించిన జలంతో కూడిన కలశాలకు డాక్టర్ కంభంపాటి రామసుబ్రహ్మణ్యం (రాంబాబు) దంపతుల ఆధ్వర్యంలో హోమాలు చేసి, పూర్ణాహుతిని సమర్పించారు. దివాన్‌చెరువుతోపాటు పరిసర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చిన జగన్మాతను దర్శించుకుని, మహాకుంభాభిషేకంలో పాల్గొని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. గత నాలుగు రోజులుగా ప్రత్యేక పూజలు, అర్చనలు, కుంకుమా పూజలు జరిగాయి. సాయంత్రం వేళలో సంగీత కచేరి, పద్యగానం, కూచిపూడి నృత్యం, భాగవతోపన్యాసం, వీణావాదం నిర్వహించారు. శనివారం సద్గురు కందుకూరి శివానందమూర్తికి శిష్యపరివారంచే 'గురువందనం' పేరుతో భక్తి నీరాజనం సమర్పిస్తారు.



హోమం చేస్తున్న దృశ్యం